'సింగరేణి'లో హైస్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

సైదాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలనీ వాంబే కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. సింగరేణి కాలనీలో పేద పిల్లల కోసం హైస్కూల్ ఏర్పాటు చేయాలని శనివారం సేఫ్ ఫౌండేషన్, ఏఐవైఎఫ్ ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) ముకుందారెడ్డి, డీఈఓ రోహిణి, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ సింగరేణి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఎంపీ ఫౌండేషన్ సభ్యులు అలివేలు. లక్ష్మి సంతోషి, సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీను నాయక్, పావని తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

● విద్యుత్ ఎస్ఈకి కార్పొరేటర్ కొప్పుల వినతి

మన్సూరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ శివారు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలను పరిష్కరించాలని సరూర్‌నగర్ సర్కిల్ విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మాధవ్‌రెడ్డిని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం ఎస్ఈ కలిసిన ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, హయత్‌నగర్ శివారులోని శ్రీసాయి గణపతినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌కు, రోడ్డుపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు మార్చాలని, మదర్ డెయిరీ వెనుక గల శ్రీకృష్ణానగర్ కాలనీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోందని, అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఏడీఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'చర్చిపై రాళ్లు విసిరిన వారిపై చర్యలు తీసుకోవాలి'

వనస్థలిపురం, మార్చి 25(ఆంధ్ర జ్యోతి): చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న సమయంలో రాళ్లు విసిరిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్వర్ణ ప్రేయర్ హౌస్ ప్రధాన కార్యదర్శి సన్నీ హెరాక్లియస్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్-2లోని స్వర్ణ ప్రేయర్ హౌస్‌లో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని సోమవారం రాత్రి పది గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తుండగా, సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో ఉండే కొందరు యువకులు రాళ్లు విసిరారని ఆయన తెలిపారు. చర్చిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సన్నీ హెరాక్లియస్ తెలిపారు.

కార్మికులకు ఒక్కపూట పని అమలు చేయాలి

● పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఒక్కపూట పని కల్పించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ, ప్రస్తుతం కార్మికులు ఉదయం 5 నుంచి 10 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తున్నారన్నారు. వేసవి కాలం నేపథ్యంలో ఒక్కపూట పనులు నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని కమిషనర్‌ను కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఏప్రిల్ 1 నుంచి ఒక్కపూట పనులకు అనుమతి ఇస్తామన్నారని తెలిపారు.

ఇంటి పన్ను తగ్గించే వరకు పోరాటం ఆపం: బీజేపీ

సరూర్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను తగ్గించాలని కోరుతూ ఈ నెల 27న మీర్‌పేట మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్ష, ధర్నా కార్యక్రమాల కరపత్రాలను మంగళవారం జిల్లెలగూడలో బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఇంటి పన్ను తగ్గించేదాకా తమ పోరాటం ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ క్లస్టర్-1,2 అధ్యక్షులు భిక్షపతిచారి,ముఖేశ్‌ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన పార్కు స్థలం స్వాధీనం

హయత్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శివగంగా కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని కాలనీ వాసులు ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం జీహెచ్ఎంసీ ఏసీపీ శ్యాంసన్, టీపీఓ అక్బర్‌లు కబ్జాకు గురవుతున్న పార్కును సందర్శించారు. కాలనీ అధ్యక్షుడు బాబు తదితరులు కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని అధికారులకు చూపించారు. అధికారులు పార్కు పూర్తి కొలతలను తీసుకుని కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్యాంసన్ మాట్లాడుతూ, త్వరలో పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్కుల్లోని సమస్యలను పరిష్కరించాలి

● మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

వనస్థలిపురం, మార్చి 25(ఆంధ్ర జ్యోతి): పార్కుల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలనీ బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొ రేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీఓస్ కాలనీలోని వివేకానంద పార్కులో కొంత కాలంగా బోరు నీరు రాకపోవడంతో మొక్కలు, చెట్లు ఎండి పోతున్నాయని, వాటికి నీరు పోయించి సంరక్షించాలని మంగళవారం వాకర్స్ లక్ష్మీప్రసన్నను కోరారు. తక్షణమే స్పందించిన ఆమె జీహెచ్ఎంసీ ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడి వాటర్ ట్యాంకర్ తెప్పించి మొక్కలకు నీరు పోయించారు. వాకర్స్ శ్రీనివాస్, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

షాపింగ్‌కు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

● 20 తులాల బంగారు నగలు, ఫోన్లు చోరీ

సైదాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుటుంబంతో కలిసి రంజాన్ పండుగ షాపింగ్‌కు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలోని 20 తులాల బంగారు నగలు, మూడు మొబైల్‌ఫోన్లు,ఖరీదైన వాచ్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. సైదాబాద్ లోకాయుక్తా కాలనీ నివాసి ఆస్రా ఫాతి మా సోమవారం రాత్రి 7 గంటలకు భర్త, కూతురుతో కలిసి రంజా న్ షాపింగ్ కు కోసం చార్మినార్ వెళ్లారు. అక్కడి నుంచి నాంపల్లిలోని బంధువుల ఇంటికి ఇఫ్తార్ విందుకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున 3.15కి ఇంటికి చేరుకోగా, ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. బెడ్‌రూమ్‌లో దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తాళం విరగొట్టి ఉంది.లాకర్‌లోని 20 తులాల బంగారు నగలు కనిపించలేదు, కూతురు గదిలోని మూడు మొబైల్‌ఫోన్లు, ఖరీదైన వాచ్ కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీపిల్లల డీఎన్ఏ ఒక్కటే

- ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడి
- మీర్‌పేట్ మర్డర్ కేసులో కీలక పరిణామం
- గురుమూర్తిపై చర్యలు తీసుకుంటాం: పోలీసులు

సరూర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన మీర్‌పేట మర్డర్ కేసులో కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి తన భార్య వెంకటమాధవిని దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. కాగా ఎలాంటి ఆధారాలు దొరకకుండా శవాన్ని ముక్కలు చేసి, హీటర్‌తో బకెట్‌లో ఉడికించి, అనంతరం స్టౌపై ఎముకలను కాల్చి.. ఆ తర్వాత వాటిని పొడి చేసి మీర్‌పేట పెద్దచెరువులో పడేశాడు. ఈ మర్డర్ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ఇటీవల గురుమూర్తి ఇంట్లో కొన్ని తల వెంట్రుకలు, రక్త నమూనాలను సేకరించారు. వాటిని అతడి పిల్లల డీఎన్ఏతో పోల్చడానికి ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల్లో తల్లీ, పిల్లల డీఎన్ఏ ఒక్కటే అని తేలింది. దీంతో కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన గురుమూర్తికి కఠినమైన శిక్షపడేలా చూస్తామని, ఇందుకు అవసరమైన అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని పోలీసులు తెలిపారు.



నెల క్రితం ఎస్ఎస్ఆర్‌నగర్ కాలనీలోని సీసీ రోడ్డును తవ్వేసిన అధికారులు (ఫైల్)



అధికారులతో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకుంటున్న ఎస్ఎస్ఆర్‌నగర్ కాలనీ వాసులు



మంగళవారం రోడ్డుపై ఉన్న వ్యర్థాలను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రెండు కాలనీల మధ్య రోడ్డు లొల్లి!

- అల్మాస్‌గూడలో వేర్వేరు లేఅవుట్లు, డివిజన్ల మధ్య రోడ్డు అనుసంధానానికి అధికారుల యత్నం
- కౌన్సిల్ సమావేశంలో తీర్మానం, టెండరు ఖరారు
- రోడ్డు పనులను అడ్డుకున్న ఎస్ఎస్ఆర్‌నగర్ వాసులు

సరూర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో రెండు కాలనీల మధ్య రోడ్డు కోసం లడాయి తలెత్తింది. బడంగ్‌పేటలోని 23వ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ నుంచి అల్మాస్‌గూడ 2వ డివిజన్‌లోని ఎస్ఎస్ఆర్‌నగర్ కాలనీకి అనుసంధానం (లింకు) చేయడానికి మున్సిపల్ అధికారులు ప్రయత్నించగా, ఎస్ఎస్ఆర్ నగర్ కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఈ రెండు కాలనీలు వేర్వేరు డివిజన్లలో, వేర్వేరు లేఅవుట్లలో ఉండటంతో సదరు లేఅవుట్ల ప్రకారం రెండు కాలనీలకు లింకు రోడ్డు లేదు. ఎస్ఎస్ఆర్ నగర్ కాలనీ ఎత్తు ప్రదేశంలో ఉండటం వల్ల వర్షాలు కురిసినప్పుడు వరద మొత్తం లక్ష్మీనగర్ కాలనీ వైపు ప్రవహిస్తోంది. పైగా ఆ కాలనీవాసులు ఎక్కడికైనా వెళ్లాలంటే కొంత దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దాంతో లక్ష్మీనగర్‌వాసులు అధికారులను, రెండు డివిజన్ల మాజీ కార్పొరేటర్లను ఆశ్రయించడంతో పాలకవర్గం పదవిలో ఉండగానే రెండు కాలనీల మధ్య అనుసంధానం (లింకు) కోసం నిధులు మంజూరు చేశారు. ఎత్తుగా ఉన్న ఎస్ఎస్ఆర్ నగర్ సీసీ రోడ్డును నెల రోజుల క్రితం అధికారులు తవ్వేశారు. దాంతో స్థానికులు అడ్డంగా రాళ్లు పాతారు.

అధికారులతో వాగ్వాదం.. పనులకు ఆటంకం

తాజాగా రోడ్డు పనులకు టెండర్ కూడా ఖరారు కావడంతో మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అక్కడకు చేరుకుని గతంలో తవ్వేసిన వ్యర్థాలను తరలించే పనులను చేపట్టారు.

విషయం తెలుసుకున్న ఎస్ఎస్ఆర్‌నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. తమ కాలనీ నుంచి లక్ష్మీనగర్‌కు లింకు ఇవ్వొద్దని, ఇక్కడ కేవలం 12 అడుగుల దారితో పాటు ప్రమాదకరమైన మలుపు కూడా ఉందని, దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, తాము నిబంధనల ప్రకారం రోడ్డు వేస్తామని, ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పనులను అడ్డుకుంటే పోలీసుల సహకారంతోనైనా పూర్తి చేస్తామని వారు అన్నారు. అనంతరం అక్కడి వ్యర్థాలను తొలగించి వెళ్లారు. కాగా తమ కాలనీ నుంచి లక్ష్మీనగర్‌కు ఇప్పటికే చిన్న దారి ఉందని, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు దానిని వినియోగించుకుంటున్నారని ఎస్ఎస్ఆర్‌నగర్ వాసులు తెలిపారు.

కార్లు, ఇతర వాహనాలు వెళ్లేలా రోడ్డు వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల ప్రస్తుతం ఉన్న రోడ్డును అలాగే కొనసాగించాలని, రోడ్డును విస్తరిస్తే మాత్రం అడ్డుకుంటామని వారు తెగేసి చెప్పారు. మాజీ కార్పొరేటర్లు, అధికారులు కలిసి పర్సంటేజీల కోసమే ఇక్కడ రోడ్డు వేస్తున్నారని వారు ఆరోపించారు. మరో పక్క అధికారులు మాత్రం కౌన్సిల్‌లో చేసిన తీర్మానం ప్రకారం పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇక ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..!

యూజీడీ నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● అధికారులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశం

చంపాపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభోదయ కాలనీలో యూజీడీ నిర్మాణంలో జలమండలి అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలనీ ప్రతినిధులు, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, యూజీడీ నిర్మాణంలో సరైన లెవల్స్‌ను పాటించాలని, నిర్మాణం చేపట్టే ప్రాంతం గురించి డ్రాయింగ్ రూపంలో నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. కాలనీలో ఉన్న పశువుల దొడ్డి దగ్గర నుంచి కింది ప్రాంతం వరకు నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మెయిన్ లైన్ ముందుగా వేస్తే సరైన లెవల్స్ కలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, కాలనీ ప్రతినిధులు చేగోని మల్లేశ్‌గౌడ్, చేగోని విఠల్‌గౌడ్, గొరిగె శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులు, కాలనీ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

'తుర్కయంజాల్'కు ఉచిత నీటి పథకాన్ని అమలు చేయాలి: బీజేపీ

హయత్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీఓ నంబర్ 211 ప్రకారం జీహెచ్ఎంసీలో ఉచితంగా అందిస్తున్న తాగునీటి పథకాన్ని తుర్కయంజాల్ మున్సిపాలిటీకి కూడా వర్తింపజేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపాలిటి బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, తుర్కయంజాల్ కొత్తగా గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడిందన్నారు. ఇక్కడ అధికంగా పేదలు ఉన్నారని,ప్రతి నెలా నీటి బిల్లు లు రూ. 300 వరకు వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ మాదిరిగానే మున్సిపాలిటీలో కూడా ఉచిత నీటి పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ క్రమ శిక్షణ కమిటి నాయకుడు బోసుపల్లి ప్రతాప్, రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు రమేష్, బల్‌దేవ్‌రెడ్డి పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

జీవితాన్ని ప్రేమించండి.. మత్తుకు దూరంగా ఉండండి

● రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జీవితాన్ని ప్రేమించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మాదక ద్రవ్యాలపై ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలు మనిషిని పూర్తిగా లోబర్చుకుని పూర్తిగా దెబ్బతీసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తాయన్నారు. మాదకద్రవ్యాలు మనిషిపై మానసికంగా, శారీరకంగా తీవ్రప్రభావం చూపుతాయన్నారు. అందుకే ప్రభుత్వం మాదక ద్రవ్యాల తయారీ, వినియోగంపై నిషేధం విధించి కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ, పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడమే కాదు.. వారు దానిని ఎలా వినియోగించుకుంటున్నారనే దానిపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. మాదక ద్రవ్యాల అలవాటును తొలిదశలో గుర్తిస్తే చాలా వరకు మాన్పించవచ్చన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు, రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంప నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మి మహిళా మండలి రజతోత్సవంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి, దయానంద్‌గుప్తా తదితరులు

మహిళా శక్తిని చాటాలి

● మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఎల్బీనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాసవీకాలనీలోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం జరిగిన అష్టలక్ష్మి మహిళా మండలి రజతోత్సవానికి ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతా గుప్తాతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ముందడుగు వేస్తే తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. 25 సంవత్సరాలుగా మహిళలంతా ఏకతాటిపై నిలిచి మహిళా మండలిని నడిపించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, రంగా నరసింహగుప్తా, వాసవీకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, సోమ సురేష్, చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి అరుణ, కోశాధికారి మేఘమాల, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధా న కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పాల్గొన్నారు.


ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్లు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మంగళవారంతో ముగిసింది. అధ్యక్ష పదవికి నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి కూడా నలుగురు, ప్రధాన కార్యదర్శి పదవికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇద్దరు, లైబ్రరీ సెక్రటరీ పదవికి ముగ్గురు, కోశాధికారి, క్రీడల కార్యదర్శి, సాంస్కృతిక కార్యదర్శులు, మహిళా ప్రతినిధి పదవులకు ఇద్దరు చొప్పున తమ నామినేషన్లు దాఖలు చేశారు. కార్యవర్గసభ్యుల పదవులకు 17 మంది నామినేషన్లు దాఖ చేశారు. మొత్తం 35 మంది తమ నామినేషన్లు దాఖలు చేశా రని ఎన్నికల అధికారి దీకొండ రవీందర్ తెలిపారు. బార్ సోసియేషన్ కాలపరిమితి ఒక సంవత్సరం ఉం టుంది. ఎన్నికల అధికారిగా దీకొండ రవీందర్, సహా యకులుగా మాధవిరెడ్డి, చల్లా వినోద్, రాంచందర్, సందీప్ గౌడ్, కిరణ్‌గౌడ్, రామకృష్ణ, గోపాల్ గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రవీందర్‌రావులు వ్యవహరిస్తున్నారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో మరో పంచాయతీ విలీనం

● కొత్తగా 5 గ్రామాలు చేరిక

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో హయత్‌నగర్ కల్వంచ సమీపంలోని సాయినగర్ పంచాయతీని విలీనం చేస్తూ ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీల పాలకవర్గం ముగియగానే ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న గ్రామాలతో పాటు ఔటర్‌కు అనుకుని ఉన్న పంచాయతీలను ప్ర భుత్వం మున్సిపాలిటీల్లో విలీనం చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కుత్బుల్లాపూర్, గౌరెల్లితో పాటు ఔటర్‌కు అనుకుని ఉన్న తారామతిపేట, బాచారం గ్రామాలను ప్రభుత్వం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో పలు గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రవేశపెట్టి మున్సిపల్ చట్టసవరణ బిల్లుకు అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. దీంతో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో మొత్తం 5 గ్రామాలు విలీనమయ్యాయి. హయత్‌నగర్ కల్వంచ సమీపంలోని సర్వే నంబర్ 195,96,97,99, 200,204లో యాదాద్రి-భువనగిరి జిల్లా దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన సుమారు 21 ఎకరాల భూమిలో సాయినగర్ గ్రామం ఉంది. 2019 వరకు దేశ్‌ముఖ్ గ్రామ పంచాయతీకి అమ్లెట్ విలేజ్‌గా ఉన్న సాయినగర్‌ను 2019 లో ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. 2024 జనవరితో పంచాయతీ పాలకవర్గం ముగిసింది. గ్రామం చుట్టూ జీహెచ్ఎంసీ ఉండటంతో తమ గ్రామాన్ని కూడా జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం సాయినగర్ గ్రామాన్ని పెద్దఅంబర్‌పేటలో విలీనం చేసింది. ప్రస్తుతం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో మొత్తం 9 గ్రామాలు ఉన్నాయి.



పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ (ఫైల్)

మూసేసిన రోడ్లను తెరవాల్సిందే!

● భూ యజమానులకు స్పష్టం చేసిన హైడ్రా అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి25 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ నాలుగో డివిజన్‌లో ఉన్న బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీలో మూసేసిన రోడ్లను తెరవాల్సిందేనని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. రోడ్లను మూసివేస్తూ నిర్మించిన ప్రహరీలను రెండు రోజుల్లో తొలగించాలని, పార్కు స్థలాన్ని కాలనీవాసులకు అప్పగించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీకి మంగళవారం హైడ్రా అధికారులు చేరుకొని భూ యజమానులు, కాలనీ వాసులను కలిసి వివరాలు సేకరించారు. లేఅవుట్ చేసి స్థలాలను విక్రయించినవారే రోడ్లను మూసివేయడం, పార్కు స్థలాన్ని లేకుండా చేసిన తీరుపై ప్రశ్నించారు. 5.7ఎకరాల భూమిలో పాత గ్రామ పంచాయతీ లేఅవుట్ ప్రకారం ప్లాట్లు చేసి విక్రయించారని, ప్రస్తుతం భూమి పాస్ పుస్తకాలు ఉన్నాయని ఎలా చెబుతారని ప్రశ్నించారు. వ్యవసాయ భూమి పేరుతో రైతు బంధు తీసుకుంటూ, ఉచిత కరెంటు పొందుతూ.. అందులో కమర్షియల్ స్టేడియం నిర్మాణం ఏవిధంగా చేస్తారని, నిబంధనలు పాటించకపోతే చట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటామని భూయజమానులకు హెచ్చరించారు. హైడ్రా అధికారులు తిరుమల్, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పరిశీలించారు.

కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తూ మరణించిన కానిస్టేబుల్ హరిబాబు, ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ కుటుంబాలకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు మంగళవారం ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ హరీష్ బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భద్రతా నిధి నుంచి మంజూరైన నిధుల్లో కానిస్టేబుల్ హరీష్ బాబు భార్య ప్రియాంకకు రూ. 3,99,160 లు, వారి ఇద్దరు మైనర్ పిల్లలకు చెరో రూ. 2లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అలాగే మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణకు మంజూరైన డబ్బులో ఆయన తండ్రి సత్తయ్యకు రూ. 3,99,160, తల్లి జయమ్మకు మరో రూ. 3,99,160 చొప్పున చెక్కులు అందజేశారు.



బాధిత కుటుంబానికి చెక్కులు అందజేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

'ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలి'

హయత్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):జలమండలి, సీడ్ స్వచ్ఛంద సంస్థ ల ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్సు డిపోలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ ఆర్ఎంఓ శంకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఉండేలా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులను చైతన్య పర్చాలన్నారు. జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్ మాట్లాడుతూ, గ్రీన్‌హౌస్ ప్రభావంతో భవిష్యత్తులో తీవ్రమైన నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి మా ట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం నింపి సహజ వనరులను కాపడానికి తమ సంస్థ కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, ఫైర్ ఆఫీసర్ యాదగిరి ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.